క్లుప్తంగా

సమస్యకు పరిష్కారం



పెద్దకొడప్‌గల్: మండలంలోని బేగంపూర్ తండాలో రోడ్డుపై ఉన్న మురుగు నీటిని తొలగించి అధికారులు మొరం పోయించా రు. రోడ్డుపై మురుగునీరు నిల్వ ఉండటంతో స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై నీరు పోయే మార్గమేది? అనే శీర్షికన గత నెల 31న సాక్షి దిన పత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించినందుకు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

సాక్షి ఎఫెక్ట్..

గేట్లకు మరమ్మతులు



నాగిరెడ్డిపేట: మండలంలోని పోచారం ప్రాజెక్టు హెడ్ రెగ్యులేటర్ గేట్లకు ఎట్టకేలకు నీటి పారుదల శాఖ అధికారులు మరమ్మత్తులు చేపట్టారు. ప్రాజెక్టుకు సంబంధించిన హెడ్ రెగ్యులేటర్ గేట్లు కొంతకాలంగా మొరాయిస్తున్న విషయమై గత నెల 7న 'అధ్వానంగా పోచారం కాలువలు' శీర్షికన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రూ.25 లక్షల నిధులతో ప్రాజెక్టుకు హెడ్ రెగ్యులేటర్ గేట్లకు మరమ్మతు పనులు చేపట్టారు. పనులు పది రోజుల్లో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని నీటిపారుదల శాఖ డీఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఈద్గాలో బోరు తవ్వకం



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండల కేంద్రంలోని ఈద్గాలో ఆదివారం బోరు తవ్వకం పనులను బీఆర్ఎస్ నాయకులు ప్రారంభించారు. ఎమ్మెల్యే హన్మంత్ సిందే ఆదేశాల మేరకు బోరు తవ్వకం పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నీలుపటేల్, గంగాధర్, షాదుల్‌సాబ్, బాబ, జావిద్, జాఫర్, హైదర్ పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘ భవనానికి నిధులు మంజూరు



నిజాంసాగర్: మండలంలోని గాలీపూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం భవన నిర్మాణానికి మంజూరైన రూ.10 లక్షల చెక్కును సర్పంచ్ లక్ష్మారెడ్డి ఆదివారం ముదిరాజ్ సంఘ సభ్యులకు అందజేశారు. సంఘ భవనానికి నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హన్మంత్‌సింధే ముదిరాజ్ కులస్థులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు సాయిబాబ, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, ఎస్ఎంసీ చైర్మన్ గంగారాం తదితరులు పాల్గొన్నారు.

కురుమ యువజన సంఘం కార్యవర్గం ఎన్నిక



కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలో కురుమ యువజన సంఘ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దాకోళ్ల మహిపాల్, కోశాధికారిగా దొడ్లె సంజీవ్‌కుమార్, న్యాయ సలహాదారునిగా చెట్క్యారి గంగారాజ్యం ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా మర్కంటి స్వామి, ఒగ్గ నర్సింలు, మచ్చ గంగాధర్, దొడ్లె రమేష్, గండాల రవి, దొడ్లె నరేష్, నాగల్ల స్వామి, నాగల్ల స్వామి(ధోని), దుమాల మల్లేష్, చిందం మల్లేష్, చెట్క్యారి రవికాంత్, నాగల్ల రాజేందర్, దుమాల మల్లేష్, మినాయి నడిపి సాయిలు, మిద్దెల నరేష్‌ను ఎన్నుకున్నారు.

బాసట లేక బతుకులు భారం

- కులవృత్తులు కనుమరుగు
- సబ్సిడీపై ప్రభుత్వం యంత్రాలు సరఫరా చేయాలి
- కులవృత్తిదారుల వేడుకోలు



బాన్సువాడలో చెప్పులు కుడుతూ, కుండలు అమ్ముతున్న కులవృత్తిదారులు

బాన్సువాడ: బాన్సువాడకు చెందిన కుమ్మరి గంగామణి పట్టణంలోని రాజీవ్‌చౌరస్తాలో మట్టి కుండలు అమ్ముతూ జీవనం కొసాగిస్తుంది. వేసవి కాలంలోనే కుండలకు గిరాకీ ఉంటుంది. మిగత రోజుల్లో వ్యాపారం లేక బిక్కుబిక్కుమంటూ జీవనం కొనసాగించాల్సిన పరిస్థితి. ఒక్క గంగామణి జీవితమే కాదు కులవృత్తులపై ఆధారపడి జీవించే ప్రతి ఒక్కరూ ఇలాంటి జీవనమే కొనసాగిస్తున్నారు. కుల వృత్తినే నమ్ముకొని జీవిస్తున్న వారి జీవితాలు రోజురోజుకు దుర్భరంగా మారాయి. ప్రభుత్వం ఆదుకోకపోవడంతో కులవృత్తులు కనుమరుగు అవుతున్నాయి. తరతరాలుగా వస్తున్న కులవృత్తిని నమ్ముకుని కుటుంబాన్ని నెట్టుకొస్తున్న వారి పరిస్థితి దయనీయంగా మారింది. వృత్తే దైవంగా భావిస్తూ బాసట లేక బతులు భారంగా మారుతున్నాయి. కుమ్మరులు, కమ్మరులు, వడ్రంగులు, చాకలి, నాయిబ్రాహ్మణ, మేదరులు, రోహిదాస్ తదితర కులస్తులు వృత్తినే దైవంగా భావిస్తూ జీవిస్తున్నారు. వారు తయారు చేసిన వస్తువులకు ప్రత్యామ్నాయంగా మార్కెట్‌లో రెడీమేడ్ వస్తువులు రావడంతో కుదేలవుతున్నారు. ఒక్కప్పుడు కుమ్మరులు తయారు చేసిన కుండల్లో చల్లని నీటిని తాగేవారు. ప్రస్తుతం ఫ్రిజ్‌లు రావడంతో కుమ్మరులు తయారు చేసిన కుండలకు డిమాండ్ తగ్గిపోయింది. పల్లెల్లో వ్యవసాయం చేయాలంటే వడ్రంగి, కమ్మరి వారి అవసరం ఉండేది. వ్యవసాయ రంగంలో ఆధునిక యాంత్రాలు రావడంతో కులవృత్తులపై ఆధారపడిన వారి బతుకులు భారంగా మారాయి. నమ్ముకున్న వృత్తిని వదిలి గ్రామాల్లో కూలీలుగా మారుతున్నారు. ప్రభుత్వం కులవృత్తులు చేసే వారికి ఆర్థికంగా ఆదుకొని ప్రోత్సాహం కల్పించాలి. గ్రామాల్లో మురికి బట్టలను శుభ్రం చేసే రజకులకు, దోభీఘాట్‌లు నిర్మించాలి. కుమ్మరులకు సబ్సిడీపై కుండలు తయారు చేసేందుకు ఉపయోగించే విద్యుత్ యంత్రం అందించాలి. నాయీ బ్రాహ్మణులకు, మేరులకు ఆధునిక యంత్రాలు అందించాలి. అలాగే వయస్సు పైబడిన వారికి ఫించన్ అమలు చేయాలని కోరుతున్నారు.

ప్రభుత్వ ప్రకటనతో..

కులవృత్తుల వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఒక్కొక్కరికి రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించాలని ఇటీవల కేబినెట్‌లో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సబ్సిడీపై యంత్రాలు ఇవ్వాలి



ఎన్నో ఏళ్లుగా కుండలు తయారు చేస్తున్నాం. ప్రతి ఇంటిలో ఫ్రిజ్‌లు ఉండటం వల్ల కుండలకు గిరాకీ తగ్గింది. ఇప్పటి వరకు ప్రభుత్వం ద్వారా ఎలాంటి సాయం అందలేదు. సబ్సిడీపై యంత్రాలు ఇస్తే బాగుంటుంది.

–గంగమణి, కుండల తయారీదారు

ప్రభుత్వం ఆదుకోవాలి



కుల వృత్తుదారులను ప్రభుత్వం ఆదుకోవాలి. ప్రభుత్వం రూ.లక్ష వరకు ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించడం హర్షణీయం. ప్రభుత్వ నిర్ణయం మాలాంటి గరీబోళ్లకు ఎంతో ఉపసమనం.

–గణేష్, నాయీబ్రాహ్మణుడు

పరిహారం కోసం రైతుల పడిగాపులు



పంట నష్టంపై సర్వే చేస్తున్న అధికారులు(ఫైల్)

రాజంపేట: అకాల వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులు ప్రభుత్వం నుంచి పరిహారం ఎప్పుడు అందుతుందా అని ఎదురు చూస్తున్నారు. జిల్లాలో లింగంపేట, తాడ్వాయి, భిక్కనూర్ మండలాల్లో చాలా వరకు పంటలు వర్షాలకు దెబ్బతిన్నాయి. ప్రధానంగా వరి, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అకాల వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 10 వేలు నష్టపరిహారం అందజేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడంతో వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. అయినా వాటి గురించి ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



అకాల వర్షాల కారణంగా 5 ఎకరాల్లో సాగు చేసిన వరి పంట పూర్తిగా దెబ్బతినడంతో రూ. 3 లక్షల వరకు నష్టం వాటిల్లింది. ఎకరాకు రూ. 10 వేల చొప్పున పరిహారం అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించినా అమలు కాలేదు.

–ర్యావ లక్ష్మణ్, రైతు, పొందుర్తి

అధికారులకు నివేదిక పంపాం

పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదిక పంపాం. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో జమ అవుతాయి.

–వీర స్వామి, ఇన్‌చార్జి జిల్లా వ్యవసాయాధికారి

వర్షం.. తీవ్ర గాలులు



బాన్సువాడలో కురుస్తున్న వర్షం

బాన్సువాడ: బాన్సువాడ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండలు తీవ్రస్థాయిలో ఉండటంతో జనం ఉక్కిరిబిక్కిరి అయ్యారు. సాయంత్రం వాతావరణం చల్లబడి వర్షం కురవడంతో ప్రజలు ఒక్కసారిగా ఉపశమనం పొందారు. వ్యవసాయ భూములను దున్నేందుకు వర్షం ఉపయోగపడుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సదాశివనగర్: వర్షంతో ధాన్యం రాసులు తడిసిపోయాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ధాన్యాన్ని త్వరితగతిన తూకం వేయాలని రైతులు కోరుతున్నారు.

దోమకొండ: మండల కేంద్రమైన దోమకొండలో వర్షానికి విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. ట్రాన్స్‌కో ఏడీ కిరణ్ చైతన్య, ఏఈ ప్రదీప్ వెంటనే స్పందించి తమ సిబ్బందితో మరమ్మతు పనులు చేయించి విద్యుత్ సరఫరాను పురుద్ధరించారు.

బీటీ రోడ్డు పనులు ప్రారంభం



బీటీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

దోమకొండ: మండల కేంద్రంలోని బురుజు నుంచి సుభాష్‌రోడ్డు, శివలింగం, మసీద్ వరకు రూ.25 లక్షలతో బీటీరోడ్డు పనులను ఆదివారం ప్రారంభించారు. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ చొరవ తీసుకొని నిధులు మంజూరు చేయించారని జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గజవాడ శ్రీకాంత్, బీఆర్ఎస్ నాయకులు నల్లపు శ్రీను,కానుగంటి నాగరాజు, బొమ్మెర శ్రీను, షమ్మీ, నాగరాజ్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, నయిం, శంకర్ పాల్గొన్నారు.

బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



బూరుగిద్ద గ్రామంలో నిర్వహించిన సర్వేలో పాల్గొన్న ఎంఈవో రామస్వామి



మద్దెలచెర్వులో బడిబాట..

పిట్లం: మండలంలోని మద్దెలచెర్వు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో ఆదివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయురాలు శోభరాణి మద్దెల్‌చెర్వు గ్రామంలో ఇంటింట తిరిగి పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు.

తాడ్వాయి: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో నిర్వహించిన బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఐదు నుంచి 14 ఏళ్లలోపు వయస్సున్న పిల్లలను బడిలో చేర్పించాలని ఉపాధ్యాయులు సూచించారు.

లింగంపేట: బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ఎంఈవో రామస్వామి సూచించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సర్వేలో ఆయన ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఆయన వెంట సీఆర్పీలు విజయ్‌కుమార్, సంజీవ్ ఉన్నారు.

నిజాంసాగర్: మండలంలోని మాగి గ్రామంలో ముగ్గురు బడి బయటి పిల్లలను గుర్తించినట్లు టీచర్ నాగవేందర్ తెలిపారు.



తాడ్వాయిలో..



మాగిలో..

సమాచారం..

విద్యుత్ సంబురాలకు స్పీకర్ రాక

బాన్సువాడ: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం బాన్సువాడలో నిర్వహించనున్న విద్యుత్ విజయోత్సవ సంబురాలకు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి హాజరవుతారు.

ఎల్లారెడ్డిలో పాల్గొననున్న ఎమ్మెల్యే

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డిలో నిర్వహించనున్న దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యుత్ విజయోత్సవ కా ర్యక్రమంలో ఎమ్మెల్యే సురేందర్ పాల్గొంటారని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు.

బీఎల్ఎఫ్ చైర్మన్ సూర్యప్రకాష్ రాక

కామారెడ్డి టౌన్: బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) చైర్మన్ నల్లా సూర్యప్రకాష్ కామారెడ్డిలో నిర్వహించనున్న కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి హాజరవుతారని నియోజకవర్గ బీఎల్ఎఫ్ నాయకుడు సిద్దిరాములు తెలిపారు.

ఆదమరిస్తే అంతే!



తాడ్వాయి: తాడ్వాయి శబరిమాత ఆశ్రమం సమీపంలో కామారెడ్డి –ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా మారింది. కల్వర్టు వద్ద పెద్ద గొయ్యి ఏర్పడటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కల్వర్టును నాసిరకంగా నిర్మించడంతో అక్కడ గుంతగా ఏర్పడింది. వాహనదారులు దగ్గరకు వచ్చే వరకు గుంత అక్కడ గుంత ఉన్నట్లు కన్పించడం లేదు. రాత్రి సమయాల్లో వాహనదారులు ఆదమరిస్తే అంతే సంగతులు. అధికారులు స్పందించి వెంటనే కల్వర్టుకు మరమ్మతులు చేయించి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



కామారెడ్డిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జాహ్నవి

కామారెడ్డి టౌన్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి కోరారు. మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక కొత్త బస్టాండ్ వద్ద పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ భవిష్యత్ తరాల కోసం ఆరోగ్యవంతమైన వాతావరణ ఉండేలా ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని ప్రజలను కోరారు. రోడ్లకు ఇరువైపులా మొక్కలను నాటాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దేవేందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్, కౌన్సిలర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సంక్షేమ సంబురాలు జయప్రదం చేయాలి



సమావేశ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న భాస్కర్‌రెడ్డి

నస్రుల్లాబాద్: మండలంలో 9న నిర్వహించనున్న తెలంగాణ సంక్షేమ సంబురాల కార్యక్రమానికి సంబంధించిన సభను జయప్రదం చేయాలని డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి కోరారు. ఆదివారం నస్రుల్లాబాద్ రైతు వేదికలో ప్రజా ప్రతినిధులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం సభ నిర్వహించనున్న ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ పాల్త్య విఠల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్, నాయకులు ప్రభాకర్ రెడ్డి, ప్రతాప్, శ్రీనివాస్‌యాదవ్, కిషోర్ యాదవ్, శ్యామల, మహేష్ పాల్గొన్నారు.

గౌరవ వేతనం ఇవ్వాలి



రామారెడ్డి: గౌరవ వేతనం చెల్లించే వరకు సమ్మె కొనసాగిస్తామని రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఆదివారం రామారెడ్డి లో సమ్మెకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

ఆధ్యాత్మికం

బోనాల పండుగ



లింగంపేట: మండలంలోని బాణాపూర్, బాయంపల్లి గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఇంటింట బోనం అలంకరించుకొని ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు.

నర్సింగ్‌రామ్‌పల్లిలో..



నిజాంసాగర్: మండలంలోని నర్సింగ్‌రామ్‌పల్లి గ్రామంలో ముత్యాలమ్మ, నల్లపోచమ్మ ఆలయాలకు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ విఠల్‌రెడ్డి, గ్రామపెద్దలు గైని విఠల్, మోహన్‌రెడ్డి, పండరి, విఠల్‌గౌడ్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్కి భగవాన్ కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి శ్రీకల్కి భగవాన్ ఆలయంలో నిర్వహించిన అమ్మభగవాన్‌ల కల్యాణ ఉత్సవంలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజిబుద్దీన్‌లు పాల్గొన్నారు. లోక కల్యాణం కోసం అమ్మభగవాన్ భక్తులు సేవా కార్యక్రమాలు చేపట్టడాన్ని ప్రభుత్వ విప్ అభినందించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ సుగుణ, బాజ లలిత, రాంరెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు నిట్టు వేణుగోపాల్‌రావు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతం



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణం సిరిసిల్ల రోడ్డులోని శ్రీగీతా మందిరంలో పున్నమి సందర్భంగా శ్రీసత్యనారాయణ సామూహిక వ్రతాలు నిర్వహించారు. అనంతరం శ్రీరామకోటి జపలిఖిత ప్రచారకుడు కృష్ణనందస్వామి ప్రవచనాలు చేశారు.

శ్రీశారదామాత ఆలయంలో....

స్థానిక తూర్పు హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీశారదామాత ఆలయంలో సామూహిక నవదుర్గ వ్రతాలు నిర్వహించారు.

ఆలయంలో భవన నిర్మాణానికి భూమి పూజ



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్‌బీ నగర్ శ్రీఇష్ట కార్యసిద్ధి హన్‌మాన్ ఆలయంలో భవన నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేద పండితుడు అంజనేయశర్మ, ఆలయ కమిటీ ప్రతినిధులు అయిత బాల్‌కిషన్, నిత్యనందం, ప్రభాకర్, చారి, రాజేశ్వర్, కే.వినోద్, అభి తదితరులు పాల్గొన్నారు.

ఎడ్లబండ్ల ప్రదర్శన



లింగంపేట: పొల్కంపేట గ్రామంలో నాయకమ్మ, నల్లపోచమ్మ, మహాగణపతి ఆలయాల వద్ద ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడ్లబండ్లను మామిడి తోరణాలు, రంగులతో అలంకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మ, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

భిక్కనూరు: ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మైపాల్ అన్నారు. వీడీసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు ఆదివారం నాటికి 41వ రోజుకు చేరుకున్నాయి. రెండు మూడు రోజుల్లో సమావేశం ఏర్పాటు చేసి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. పలు యవజన సంఘాల ప్రతినిధులు దీక్ష శిబిరంలో కూర్చొన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు నర్సింగ్‌రావు, జోగు శివరాజు, మెట్టు సందీప్‌కుమార్, నేతలు రాము శ్రావన్‌రెడ్డి, ముదాం నరేశ్, రాజిరెడ్డి, రంజిత్, స్వామి, నాగరాజు, సత్యం పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

నాగిరెడ్డిపేట: మండలంలోని తాండూరు గ్రామానికి చెందిన బామనీండ్ల సాయిలు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు ఆదివారం ఆయనకు అప్పగించారు. లొకేషన్ ఆధారంగా పోలీసులు సెల్‌ఫోన్‌ను గుర్తించారు.

ముగిసిన బాల సంస్కార్ శిబిరం

సదాశివనగర్: మండలంలోని లింగంపల్లి గ్రామంలో గల శ్రీ కృష్ణ మందిరంలో నిర్వహిస్తున్న బాల సంస్కార్ శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను పీఠాధిపతి మచాలే బాబ, కన్హైరాజ్ బాబలు అందజేశారు.

ఎమ్మెల్యే పరామర్శ

మద్నూర్: మండల కేంద్రానికి చెందిన పైడాలకు సత్యవ్వ ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో ఎమ్మెల్యే హన్మంత్‌సింధే ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట సర్పంచ్ దరాస్ సురేశ్, కంచిన్ హన్మండ్లు ఉన్నారు.

బందోబస్తుకు వెళ్లిన పోలీసులు

ఎల్లారెడ్డిరూరల్: కామారెడ్డిలో నిర్వహిస్తున్న తెలంగాణ దశాబ్ది ఉత్సవాల బందోబస్తుకు ఎల్లారెడ్డి పోలీసులు ఆదివారం తరలివెళ్లారు. డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ శ్రీనివాస్, ఎస్సై గణేష్‌తో పాటు సిబ్బంది వెళ్లారు.

బ్రిడ్జి పనుల పరిశీలన

తాడ్వాయి: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ శివారులో ఏర్పాటు చేస్తున్న బ్రిడ్జి పనులను స్థానిక ప్రజాప్రతినిధులు పరిశీలించారు. బ్రిడ్జి పనులు పూర్తయితే నాలుగు గ్రామాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, ఉప సర్పంచ్ హైమద్, రైతు బంధు అధ్యక్షుడు వెంకట్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

లింగంపేట: మండలంలోని పోతాయిపల్లి, కోమట్‌పల్లి గ్రామాల్లో ఆదివారం వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి నియోజకవర్గ కో ఆర్డినేటర్ జమునా రాథోడ్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. షుగర్, బీపీ, గుండెకు సంబంధింత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకట్, సంతోష్, అల్లూరి, జైపాల్, నందు, రామలింగం, సిద్దు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కామారెడ్డి & ఎల్లారెడ్డి
96034 62494
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
యం. మధుసూధన్ (ACO) : 9951027699
ఎల్లారెడ్డి: డి.యస్.ఎస్. గౌడ్ : 9573130288
కామారెడ్డి : కె. రాజు : 9949699861
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899